# కాళేశ్వరం,పోలవరం భద్రతపై అనిశ్చితి సృష్టించిన భూకంపం

**భూకంపాలకు బాటలు వేస్తున్న భారీజలాశయాలు**

**భూమి గట్టిభాగంపై నీటిపీడన ప్రభావంతో తరుచూ ప్రకంపనలు**

**హైదరాబాద్,డిసెంబరు 4,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా కేంద్రంకు ఈశాన్యంవైపు 50కి.మి దూరంలో భూకంపకేంద్రం ఉండటంతో తెలుగు రాష్ట్రాలలో గోదావరి నదిపై ఉన్న కాళేశ్వరం, పోలవరం ప్రాజెక్టులపై భద్రతపై అనిశ్చితి ఏర్పడింది. మేడిగడ్డ ఇప్పటికే కుంగిపోగా,పోలవరం వరుస వరదలతో కొట్టుకొని పోయిన డయాఫ్రంవాల్,తరుచూ కోతకు గురవుతున్న నదీగర్భం, రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మించాల్సిన ప్రాంతంలో దెబ్బతినడం ప్రాజెక్టు నిర్మాణంలో ఇబ్బందులు పెడుతుంటే ఇప్పుడు గోదావరి బేసిన్‌లో భూకంపం రావడంతో ఈ ప్రాజెక్టుల భవిష్యత్‌పై పరివాహక ప్రాంతంలో భయాలు పెంచేస్తున్నాయి. బుధవారం ఉదయం 7.27 నిమిషాలకు భూమికంపం వచ్చింది. రిక్టర్ స్కేల్‌పై 5.0గా తీవ్రత నమోదైంది. దీనికారణంగా భూకంప కేంద్రం నుంచి 225కి.మి పరిధిలో ప్రకంపనల ప్రభావం కనిపించింది.కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్, పోలవరం నిర్మాణాల వల్ల భూపొరల్లో 40 కిమి కింద నీటిపీడన ప్రభావం ఏర్పడటం వల్ల కూడా తరుచూ భూపలకలు విరగడం వల్ల కూడా ఈ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉత్తరతెలంగాణ ప్రాంతం,కరీంనగర్,వరంగల్, ఖమ్మం,ఆదిలాబాద్ అంతేకాదు రంగారెడ్డి తదితర పూర్వజిల్లాల పరిధిలో భూప్రకంపనాలు నమోదైనాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, ఏలూరు, విశాఖపట్నం వరకు భూమి కంపించింది. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగుబాటుతో ఇప్పటికే అక్కడి భూభౌతిక పరిస్థితిపై అనేక అనుమానాలు ఉన్నాయి. గోదావరి నదిలో అవక్షేపణ (సెడిమెంటేషన్) అధికమోతాదులో ఉండటంతో అక్కడ భూపొరల్లో కదలికలు కూడా ఉంటాయి.మరోవైపు సింగరేణి బొగ్గుగనులు అండర్‌గ్రౌండ్,ఓపెన్‌కాస్టులు గనులు ఉండటంతో ఈ ప్రాంతంలోని పోలవరం, కాళేశ్వరం ప్రాజెక్టులు ఉండటంతో వాటి భవితవ్యంపై కూడా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సింగరేణి గనులు తవ్వడం కృత్రిమ జలాశయాలు పెరిగిపోవడంతో నేల మొత్తదనం ఎక్కువై భూకంప తరంగాలు వేగంగా వ్యాపించే పరిస్థితులు భూమిలో ఏర్పడ్డాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.పోలవరం జలాశయం 118800 చ.మై.

ఏపి,తెలంగాణ,చత్తీస్‌ఘడ్ ఒరిస్సా రాష్ట్రాలు పరివాహక ప్రాంతం విస్తరించి 194టిఎంసిల నీటిని నిలుపుకొనే సామర్థ్యం కలిగి ఉంటుంది.గరిష్ఠ నీటిలోతు 32.08 మీటర్లు అంటే 150అడుగుల నీటి మట్టం ఉంటుంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం,సుందిళ్ళ బ్యారేజిల నుంచి 160టిఎంసిల నీటిని ఎత్తిపోయడానికి డిజైన్ చేశారు. 16.17టిఎంసిల గరిష్ఠనీటి సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మించిన కొద్ది నెలలకే కూలడం మొదలు పెట్టింది. 2023 అక్టోబరులో ఏడవబ్లాక్ మొత్తం కుంగిపోయింది.పెద్దరిజర్వాయర్లు భూకంపాలను సృష్టించడానికి ప్రభావితం చేస్తాయని చెప్పడానికి మహారాష్ట్రలోని కొయినా ఆనకట్ట ఒక ప్రయోగశాలగా మారింది. ఆరు దశాబ్దాల క్రితం మన దేశంలో కొయినా ప్రాజెక్టు పరిసరాలలో 1967డిసెంబరు 10న భూకంపం సంభవించడంతో 200 మంది ప్రజలు చనిపోయారు వేలాది మంది గాయాలపాలైనారు 80శాతంకు పైగా ఇళ్ళు నేలమట్టమైనాయి. డ్యామ్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలోనే భూకంపకేంద్రం ఉన్నది. సహజవనరులను అతిగా ధ్వంసంచేయడం, అభివృద్ధిపేరుతో ప్రకృతి విధ్వంసం చేయడం భూస్వభావం మార్పులు లోనై ఇలాంటి పరిణామాలు ఏర్పడుతున్నాయి. భూకంపకేంద్రం ఉన్న ప్రాంతంలోనే ఆగస్టు 31న గాలిదుమారం ఆకస్మికంగా వచ్చిదాదాపు లక్షకుపైగా చెట్లు నూటాయాభై ఎకరాలలో కూలిపోయాయి. వీటికి సమీపంలో ఒకవైపు మేడిగడ్డ బ్యారేజి మరోవైపు పోలవరం డ్యామ్ ఉంది. తెలుగురాష్ట్రాలలో బుధవారం ఉదయం వచ్చిన భూప్రకంపనలపై జిఎస్ఐ సీనియర్ సైంటిస్టు గుండ రమేష్ మాట్లాడుతూ తెలంగాణలో గ్రానైట్‌పొరలతో ఉంటుందని కాళేశ్వరం పోలవరం రిజర్వాయర్ల వల్ల కలిగిన నీటి ఒత్తిడి కారణంగా భూకంపం వచ్చిందని చెప్పడానికి ఏలాంటి ఆధారాలు లేవని అభిప్రాయపడ్డారు. కృత్రిమనీటి నిల్వల జలాశయాల వల్ల 90కిపైగా భూకంప ప్రదేశాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడ్డాయి.

సీనియర్ సైంటిస్ బివి సుబ్బారెడ్డి భూకంపాలకు వివిధ కారణాలు ఉంటాయని కాళేశ్వరం ప్రాజెక్టు ఒక కారణమై ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన ప్రాంతం భూకంప వైపరిత్యంకు అనుకూల ప్రదేశంగా ఉందని నీటిపీడనం ఎక్కువైతే భూకంపం వచ్చే అవకాశం ఉటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్‌జిఆర్ఐ అధికారి డాక్టర్ శేఖర్ భద్రాచలంలో 1969లో కూడా సంభవించిందని గోదావరి పరివాహక ప్రాంతంలో ఇది మాములే అని,మళ్ళీ భూకంపం వచ్చే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరంలేదని భరోసా ఇచ్చే ప్రయత్నంచేశారు. జిఎస్ఐ సీనియర్ సైంటిస్ట్ గుండ రమేష్ మాట్లాడుతూ హిమలయపర్వత ప్రాంతాల్లో నేలలో గట్టిదనం ఉండదని అక్కడ ప్రమాదకరమైన భూకంపాలు వస్తాయని ముఖ్యంగా వాయువ్య భారతంలో తీవ్రమైన భూకంపాలు వచ్చే అవకాశం ఉంటుందని లాతూరు అనుభవాలను ఆయన గుర్తుచేశారు. హిమాలయాలు అవి ఒకప్పుడు సముద్రాలని అక్కడ నేల మెత్తదనంగా ఉంటుందని జోన్-5లో ఉన్న ఏరియాల్లో తీవ్రత ఎక్కువ ఉంటుంది. 1969 జూలై 5న భద్రాచలం వద్ద రిక్టర్‌స్కేల్‌పై5.7తొ అత్యధిక తీవ్రత కలిగిన భూకంపం వచ్చిందని ఆయన తెలిపారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన సహజ జలాశయాలు,కృత్రిమ జలాశయాలు భూకంపాల వల్ల దెబ్బతింటాయని కూలిపోతాయనే భయం వూహాజనితమని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టును ఆశ్రయించిన హరీష్ రావు

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని కోరుతూ మాజీ మంత్రి హరీష్ రావు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. కాంగ్రెస్ నాయకుడు, సిద్దిపేట్‌కు చెందిన చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరీష్ రావుతో పాటు హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావుపై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో మంగళవారం నాడు కేసు నమోదవడం విదితమే. ఈ సందర్భంగా చక్రధర్ గౌడ్ హరీష్ రావుపై తీవ్రమైన ఆ రోపణలు చేయడం విదితమే. దీనిపై హరీష్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ కేవలం రాజకీయ కారణాలతో తనపై కేసు నమోదు చేసినందున దీనిని కొట్టి వేయాలని కోరారు. హరీష్ రావు పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు దీనిపై పోలీసులకు నోటీసులు జారీ చేసింది.

# చెక్ పోస్టుల్లో ఎసిబి దాడులు: పలుచోట్ల నగదు జప్తు

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్ర సరిహద్దుల్లో గల రవాణా శాఖ చెక్‌పోస్టుల్లో ఎసిబి అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల లెక్కలోలేని నగదు భారీగా లభించడంతో వాటిని జప్తుచేశారు. చెక్‌పోస్టుల్లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని అందిన సమాచారం మేరకు హైదరాబాద్ నుంచి ఎసిబి అధికారుల ప్రత్యేక బృందాలు ఆయా ప్రాంతాల చెక్‌పోస్టులకు ఉదయమే వెళ్లాయి. ఎసిబి అధికారులు డ్రైవర్లు, క్లీనర్ల వేషాల్లో వెళ్లడంతో చెక్‌పోస్టుల్లో వున్న సిబ్బంది వారిని గుర్తించకుండా ఎప్పటిలాగే లంచాలు డిమాండ్ చేయడం గమనార్హం. ఎసిబి అధికారులు కూడా తాము ఎవరైనదీ చెప్పకుండా సిబ్బంది కోరినట్లుగా లంచాలు ఇచ్చినట్లే ఇచ్చి ఆ తరువాత తాము ఎవరన్నదీ చెప్పడంతో అక్కడున్న వారు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ లోని భోరజ్ చెక్‌పోస్టులో రూ.62,500లు, విష్ణుపురం చెక్‌పోస్టులో రూ.86,500లు, ఆలంపూర్ చెక్‌పోస్టులో 29,200 రూపాయలు పట్టుబడ్డాయి. ఈ మూడు చెక్‌పోస్టుల్లోవున్న రవాణా శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎసిబి అధికారులు సిఫార్సు చేయగా అనుమతి లేకుండా వున్న బయటి వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. వీటితోపాటు మరో ఏడు చెక్‌పోస్టుల్లో కూడా నగదు లభ్యమయ్యింది. ఇక్కడి సిబ్బందిపైనా చర్యలకు ఎసిబి అధికారులు ఆదేశించారు. ఎసిబి డిజిగా విజయ్ కుమార్ బాధ్యతలు చేబట్టిన తరువాత రవాణా శాఖ చెక్‌పోస్టులపై ఎసిబి దాడులు జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# బంగ్లాదేశ్ హిందువులను కాపాడే సైనిక చర్యలు చేపట్టాలి: ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి

**ఆ దాడులను నిరసిస్తూ, హిందువుల రక్షణకై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిందూ ఐక్యవేదిక సంఘీభావ సభ**

**హైదరాబాద్ (ధర్నాచౌక్), డిసెంబరు 4, ప్రభాతవార్త:** బంగ్లాదేశ్ లోని హిందువులను కాపాడేందుకు సైనిక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఇందిరా పార్క్ వద్ద బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, హిందువుల రక్షణకై భాగ్యనగర్ గణేష్‌ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిందూ ఐక్యవేదిక సంఘీభావ సభ పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సభనుద్దేసించి రాజాసింగ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్ హిందువులను చంపడానికి పెద్ద ఎత్తున పాక్ సైన్యం వెళ్లినట్లు జాతీయ మీడియా ద్వారా తెలుస్తోందని, ఇంకా నిరీక్షిస్తే అక్కడ ఒక్క హిందువు కూడా




బుధవారం జరిగిన సంఘీభావ సభలో మాట్లాడుతున్న రాజాసింగ్

మిగిలే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ పరిస్థితుల నేపథ్యంలో ముందు భారతదేశంలోని హిందువులు సైతం ఖచ్చితంగా మరింత పోరాట పటిమను పెంపొందించుకోవాలని సూచించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రాజ్యవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గాంధీ, నెహ్రూ సహా ఆనాటి కాంగ్రెస్ పెద్దలు అనాలోచితంగా చేసిన నిర్ణయాలతో నేటి బంగ్లాదేశ్‌లో కానీ, నాటి పాకిస్తాన్‌లో కానీ హిందువులు, సిక్కు లు చెప్పలేని దారుణాలకు గురయ్యారని గుర్తుచేశారు. త్రిదండి దేవనాథ జీయర్‌స్వామి మాట్లాడుతూ ధర్మశాస్త్రాలు శాంతిని ప్రబోధించినప్పటికీ ఆపత్కాలంలో రక్షించుకోవల్సిన కర్తవ్యాన్ని కూడా తెలియచేశాయంటూ వివరించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ మాధవస్వామి, శ్రీశక్తి పీఠం చెనారస్ బాబూజీ, స్వామి నారాయణ పీఠానికి చెందిన నీలకంఠ విద్యాపీఠ్ స్వామిజీ హరిదర్శన్, దుర్గానందపురి స్వామిజీ, ఆర్ఎస్ఎస్ నేత బర్ల సుందర్‌రెడ్డి, బీజేపీ కార్పోరేటర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశ్వేశప్రసన్నతీర్థస్వామికి పెద్దమర్యాద



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం విచ్చేసిన కర్నాటక ఉడిపి ఫెజావర్ మఠం పీఠాధిపతి విశ్వేశప్రసన్నతీర్థస్వామికి టిటిడి అధికారులు పెద్దమర్యాదతో స్వాగతం పలికారు. బుధవారం ఉదయం శిష్యులతో కలసి తిరుమలకు వచ్చిన స్వామికి బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, టిటిడి వింగ్ విఎస్ఒ ఎస్టీవిరామ్‌కుమార్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి ఆలయ సాంప్రదాయంగా స్వాగతం పలికారు. మహద్వారం నుండి ఆలయంలోనికి చేరుకున్న విశ్వేశప్రసన్నతీర్థ స్వామి తొలుత ధ్వజస్తంభానికి మొక్కారు. ఆనందనిలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# పిఎస్ఎల్‌వి - సి 59 విజయవంతం కావాలి



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** శ్రీహరికోట నుండి బుధవారం ఉదయం ప్రయోగించాల్సిన పిఎస్ఎల్‌వి సి 50న రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ ఇస్రో శాస్త్రవేత్తలు తిరు మలకు వచ్చారు. బుధవారం వేకువ జామున స్వామివారి సుప్రభాత సేవలో ఇస్రో ప్రతినిధులు ఆలయం లోనికి చేరుకుని నమూనా రాకెట్‌కు స్వామివారి పాదాలచెంత ఉంచి పూజలు చేశారు. శ్రీవారి ఆశీస్సులందుకున్నామని శాస్త్రవేత్తలు విశ్వాసం వ్యక్తం చేశారు.

# రాష్ట్రం అభివృద్ధిలో ముందంజ

## ఎపి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

**తిరుమల,డిసెంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయు డు నాయకత్వంలో సుపరి పాలన దిశగా అడుగులు వేస్తోందని, అభివృద్ధిలో దేశంలో ముందంజలో ఉండా లని దేవదేవుడు శ్రీవేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు రాష్ట్రమంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఏడుకొండల



స్వామిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. బుధవారం ఉదయం మంత్రి కుటుం బంతో కలసి ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారితీర్థప్రసాదాలు అందజేశారు.

# పంచమిసారె ఊరేగింపునకు ఏర్పాట్లు సిద్ధం

**తిరుమల,డిసెంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** తిరుచానూరులో కొలువైన శ్రీపద్మావతిఅమ్మవారికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరఘట్టమైన పంచమి తీర్థానికి అశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లుపై టిటిడి, పోలీసు, విజిలెన్స్ సంయుక్తంగా పర్యవే క్షించారు. తిరుమల శ్రీవారి నుండి తిరూచానూరు అమ్మవారికి సారె ఊరేగింపుగా తీసుకురానుండటంతో ఇందుకు తిరుపతి అలిపిరి నుండి నగరంలో ఊరేగింపుగా వెళ్ళే మార్గాలను పరిశీలించారు. టిటిడి ఇఒ శ్యామలరావు, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం,తిరుపతి శాంతిభద్రతల అదనపు ఎస్పీ రవిమనోహరచారి తదితరులు అన్ని ప్రాంతాలను పరిశీలించారు. శుక్రవారం (రేపు)జరిగే పంచమిని విజయవంతం చేయడంతోబాటు భక్తులకు అసౌకర్యంలేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

# ప్రజా పాలనలో పేదవాడి సొంతింటి కల సాకారం

**ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికకు రంగం సిద్ధం**

**పారదర్శక ఎంపిక కోసం మొబైల్ యాప్**

**నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**6వ తేదీ నుంచి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ**

**ప్రతీ పేదవాడికి ఇల్లు ఇస్తాం : మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త :** తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికకు రంగం సిద్ధమైంది. లబ్దిదారుల పారదర్శక ఎంపిక కోసం ప్రత్యేక మొబైల్ యాప్ సిద్ధమైంది. ఈ యాప్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నేడు రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. రాజకీయ పార్టీలు, ప్రాంతాలు అన్న తేడా లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్లు అందిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. లబ్దిదారుల ఎంపిక నుంచి ఇళ్ల పంపిణీ పూర్తయ్యే వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని అధికారులు ఇప్పటికే నిర్ణయించారు. గ్రామీణ ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకుని యాప్‌లో తెలుగు వర్షన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు బుధవారం రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలో నీడలేని పేదలందరికీ ఇం దిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందనీ, ఈ పథకం అమలుకు ఉన్న అవరోధాలను అధిగమిస్తూ అవసరమైన కార్యాచరణను వేగవంతం చేసిందని తెలిపారు. లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా రాజకీయ ప్రమేయానికి తావు లేకుండా అర్హులైన వారిని ఎంపిక చేయడానికి వీలుగా మొబైల్ యాప్‌ను రూపొందించామని స్పష్టం చేశారు.

కాగా, దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్నామనీ, మహిళల పేరు మీద ఇండ్లు మంజూరు చేస్తున్నామనీ, ఈ ఇండ్లకు నాలుగు దశల్లో లబ్దిదా రులకు చెల్లింపులు చేయనున్నారు. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుం డా నేరుగా లబ్దిదారుని బ్యాంకు ఖాతాలో నగదును జమ చేస్తారు. లబ్దిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణం లోనైనా నిర్మించుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రతీ మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలను చేపడతారు.

# హైడ్రా మరో కీలక నిర్ణయం

**ప్రతి సోమవారం ఫిర్యాదుల స్వీకరణ**

**జనవరి నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడి**

**హైదరాబాద్, డిసెంబరు 4,ప్రభాతవార్త:** అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం కాంగ్రెస్ సర్కార్ హైడ్రా తీసుకొచ్చిన విషయం తెలిసిందే. చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రోడ్లు, నాలాల సంరక్షణే కాకుండా విపత్తుల నిర్వహణపై కూడా హైడ్రా పనిచేస్తుంది. అయితే, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆక్రమణలపై ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు కొత్త ఏడాదిలో ప్రతి సోమవారం బుద్ధభవన్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు.

చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలపై ఆర్జీలు ఇవ్వొచ్చని హైడ్రా తెలిపింది కాగా, ఇటీవల బడంగ్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పార్కు స్థలం కబ్జా చేశారని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి పార్కు స్థలం ఆక్రమణకు గురైనట్లు తేల్చి చర్యలు చేపట్టారు. పార్కును కాపాడినందుకు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# తిరుమలలో ఆక్రమణలపై చైర్మన్ నాయుడు ఆగ్రహం

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు**



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకొండపై దుకాణాదారులు,హోటళ్ళు,ఇతరత్రా వ్యాపారులు లైసెన్స్ పొందిన సమయంలో పేర్కొన్న నిబంధనల మేరకు వ్యాపారాలు చేసుకోవాలని, అనధికారఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు హెచ్చరించారు. కేటాయించిన స్థలం కంటే అధికంగా స్థలాలను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్న వాటిని వెంటనే తొలగించాలని ఆయన ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారాలు చేస్తున్న వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టిటిడిలో రెవెన్యూ, పంచాయతి,విజిలెన్స్ అధికారులు తమ పనితీరును నిక్కచ్చిగా సాగించాలన్నారు. టిటిడి ఛైర్మన్ హోదాలో ఆయన తిరుమలలో పరిస్థితులు, వ్యాపారాలు, దుకాణాదారులకు లైసెన్స్‌లు, హాకర్లు అనధికార వ్యాపారాలు ఇతరత్రా వాటిపై అవగాహన కల్పించుకున్నారు.దీంతో బుధవారం మధ్యాహ్నం ఆయన రెవెన్యూ, పంచాయతి, విజిలెన్స్ అధికారులతో కలసి తిరుమలలో వరాహస్వామి విశ్రాంతి భవనం ప్రాంతం, షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో దుకాణాదారులకు కేటాయించిన స్థలం కంటే అధికంగా ఆక్రమించుకోవడం, వ్యాపారాలు చేస్తుండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాగే ఆక్రమణలు ఉంటే చర్యలు తప్పవని తెలిపారు. దుకాణాల లైసెన్స్‌లు, హాకరు లైసెన్స్‌లను ఆయన తనిఖీ చేశారు. టిటిడి ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర్లు, విఎస్ఒ సురేంద్ర,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తప్పుచేశా.. రీల్స్ చేయడం పొరబాటే - క్షమాపణ చెప్పిన యువతి

**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి బుధవారం ఉదయం వచ్చిన పూజిత యువతి తిరుమలకు చేరుకునే ముందు అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రానికి కొంతముందే ఓ పాటకు డాన్స్ చేసింది. ఈ డాన్స్ రీల్స్‌ను కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్య మాల్లో వైరల్ చేశారు. దీంతో యువతి చేసిన పాట అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద కావడంతో ఆలయ పవిత్రత, టిటిడి నిబంధనలు ఉల్లంఘిం చిందని సామాజిక మాధ్యమాల్లో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై టిటిడి విజిలెన్స్ అధికారులు కూడా యువతిపై కేసు నమోదు చేసేందుకు చర్యలకు ఉపక్రమించారు.వాతావరణానికి ఆకర్షితురాలై పాటకు రీల్స్‌డాన్స్ చేయడం జరిగిందని, అది తప్పని ఊహించలేదని వీడియో రిలీజ్ చేసింది.

# బొటానికల్ గార్డెన్‌లో కొత్తప్రాజెక్టులు





బుధవారం బొటానికల్ గార్డెన్ ఆవరణలో ఏర్పాటు చేసిన అభివృద్ధిపనులను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వర్చువల్‌గా టిజిఎఫ్‌డిసి ఆఫీసు కాంప్లెక్సులను ప్రారంభిస్తున్న దృశ్యం

**కొత్తగా వృక్షపరిచయ క్షేత్రం, వర్చువల్ సఫారీ సెంటర్ ప్రారంభం**

**పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం రేవంత్**

**హైదరాబాద్ (గచ్చిబౌలి), డిసెంబరు 4 ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ అటవీ అభివ ృద్ధి సంస్థ(టిజిఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో కొం డాపూర్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి పాల్గొని పలు అభివ ృద్ధి పనులను ప్రారంభించారు. నగరంలో సుందరీకరణ, పచ్చదనం పెంపొందించి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో బొటానికల్ గార్డెన్ ఆవరణలో పలు అత్యాధునిక హంగులతో నూతన వసతులను ఏర్పాటు చేశారు. తెలంగాణ అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖతో కలిసి ముఖ్యఅతిధిగా హాజరై బొటానికల్ గార్డెన్‌లో అభివ ృద్ధి చేసిన ఎకో టూరిజం, వృక్షక్షేత్రం, వర్చువల్ మోడల్ వైల్డ్‌లైఫ్ మోడల్ సఫారీ కేంద్రాలను బుధవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. దీంతో పాటు కొత్తగూడెం - పాల్వంచ, సత్తుపల్లి డివిజనల్ మేనేజర్ ఆఫీసు కాంప్లెక్సులను బొటానికల్ గార్డెన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో పాటు ఫారెస్ట్ ఎకో టూరిజం అభివ ృద్ధి కార్యాలయానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. గార్డెన్‌లో 75 వనాలతో నూతనంగా రూపొం దించిన వ ృక్ష పరిచయ క్షేత్రాన్ని, నూతనంగా ఏర్పాటు చేసిన వర్చువల్ వైల్డ్‌లైఫ్ సఫారీ మోడల్ కేంద్రాన్ని ప్రారంభించారు. టిజిఎఫ్‌డిసి నూతనంగా అందుబా టు లోకి తీసుకువచ్చిన వాహనాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి అందులోని బ్యాటరీ వాహనంలో గార్డెన్ మొత్తం పరిశీలించి మరింత అభివ ృద్ధి చేయాలని అధికా రులకు సూచించారు. గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ఎక్జిబిషన్‌ను తిలకించిన ముఖ్యమంత్రి, అక్కడికి వచ్చిన స్కూల్ పిల్లలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రారం భోత్సవ కార్యక్రమం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ టిజిఎఫ్‌డిసిఎల్ దేశంలోనే శాశ్వత అటవీ యాజమాన్యం, ఎకో టూరిజం రంగంలో అగ్రగామిగా ఎదిగిందన్నారు. జూలై 2024లో 32,951 హెక్టార్ల ప్రాంతానికి అంతర్జాతీయ ట్రేడ్ సర్టిఫికేట్ ఎఫ్ఎస్‌సి ఎఫ్ఎం, సిటిసిలను పొందిందని తెలిపారు. గత సంవత్సర కాలంలో టిజిఎఫ్‌డిసిఎల్ నికర లాభం 100శాతం పెరిగిందని ప్రకటించారు. 12కోట్ల రూపా యల వ్యయంతో కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి, కాగజ్‌నగర్‌లలో మొత్తం 17 నూతన భవనాలను నిర్మించినట్లు తెలిపారు. బొటానికల్ గార్డెన్ ఆవరణలో నూతనంగా చేపడుతున్న గ్రీన్ బిల్డింగ్ నిర్మాణం మరో 6 నెలల్లో పూర్తవుతుందని, గార్డెన్‌కు ఉన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు 5ఎంఎల్‌డి ఎస్‌టిపిని అమర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పిఎసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, టిఎస్ఎఫ్‌డిసి చైర్మన్ పోదెం వీరయ్య, ఎండి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, చేవెళ్ల

Lr No: SE/IC/Chevella/DEE-1/TS3/Advt/1375, తేది: 04.12.2024
క్ర.సం.1, టెండర్ ప్రకటన నంబర్: 06/2024-25, తేది: 04.12.2024, పని పేరు: వికారాబాద్ జిల్లా, తాండూరు (గ్రా) మరియు (మం) గొల్లచెరువు యొక్క ట్యాంక్ బండ్‌పై ఇతర సౌకర్యాలు మరియు విద్యుద్దీకరణ ఏర్పాటు, గ్రీనరీ యొక్క అభివృద్ధి, కల్వర్ట్‌ల నిర్మాణం, ఫీడర్ ఛానల్‌తోసహా బాక్స్ డ్రెన్ యొక్క నిర్మాణం మరియు రీ-సెక్షనింగ్, బండ్‌పై WBM రోడ్ వేయుట, ట్యాంక్ బెడ్ ఏరియాలో నీటి గుర్రపు డెక్క మొక్కల తొలగింపు, మురికినీటి డైవర్షన్ బాక్స్ డ్రెన్ యొక్క నిర్మాణం, గొల్ల చెరువు యొక్క సుందరీకరణ మరియు సంరక్షణ. సొమ్ము లక్షలలో: 395.36, టెండర్ ప్రారంభ తేది: 05.12.2024, టెండర్ ముగింపు తేది: 19.12.2024, టెండర్ తెరుచు తేది: 19.12.2024, నెలలలో సమయ కాలం: 12.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, చేవెళ్ల
DIPR.No.7450-PP/CL/Advt/1/2024-25, తేది: 04.12.2024

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)
తేది: 4.12.2024
రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ అధ్యక్షులు అయిన శ్రీ జిలుకర రవికుమార్ గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ జిలుకర రవికుమార్ అధ్యక్షులు (2) శ్రీ కమ్మంపాటి శ్రీను -ప్రధాన కార్యదర్శి (3) శ్రీమతి తంగెళ్ళపల్లి శ్యామల -కోశాధికారి ప్రధాన కార్యవర్గ సభ్యులు: మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము 11-21-662, ఎన్‌టిఆర్‌నగర్, ఎల్‌బి నగర్, హైదరాబాద్-74. సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C. గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.
సం/-. అధ్యక్షులు సంతకం
తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ.

